E-KABURU
E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
14-04-2025 సోమవారం | పేజీలు–6 | హైదరాబాద్
ekaburu.com



చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి.. మరో సెంచరీ



బిల్డర్ల సమస్యల పరిష్కారానికి సిద్ధం



సుడాన్ లో దారుణం.. కరువు పీడిత శిబిరాలపై దాడులు.. కుప్పలుగా శవాలు



పండగ వేళ విరుచుకుపడ్డ రష్యా.. 20 మందికిపైగా మృతి!



కాలయాపన ఇంకెన్నాళ్లు?.. టన్నెల్‌లో చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి?: హరీశ్‌రావు



అంబేడ్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ది

# భూభారతి– వందేళ్ల దృష్టితో అభివృద్ధి

- సామాన్య రైతులకూ సులభంగా అర్థమయ్యే ఆధునిక పోర్టల్
- భద్రతా ప్రమాణాలతో పకడ్బందీ ఫైర్‌వాల్, విశ్వసనీయ సంస్థకు నిర్వహణ బాధ్యత
- వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
- వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు



**హైదరాబాద్:** వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య రైతులకు సైతం అర్థమయ్యేలా భూభారతి వెబ్‌సైట్ ఉండాలన్నారు. అత్యాధునికంగా రూపొందించాలని కోరారు. భద్రతాపరమైన సమస్యలు రాకుండా పకడ్బందీగా ఫైర్‌వాల్ ఉండాలన్న సీఎం.. భూభారతి నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగిస్తే బాగుంటుందని తెలిపారు. భూభారతి పోర్టల్‌ను సోమవారం జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ తరువాయి 2లో

# రేవంత్ లాంటి మోసగాడిని నమ్మినందుకు తెలంగాణ ఆగమైంది



**తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాంటి మోసపూరిత నేతను నమ్మిన ఫలితంగా తీవ్రంగా మోసపోయారని, రాష్ట్రానికి చివరికి చేతిలో మిగిలింది చిప్పే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.**

**రేవంత్ లాంటి మోసగాడిని నమ్మినందుకు తెలంగాణ ఆగమైంది : కేటీఆర్**

**ఈ కబురు,మేడ్చల్ మల్కాజ్‌గిరి :**
తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాంటి మోసపూరిత నేతను నమ్మిన ఫలితంగా తీవ్రంగా మోసపోయారని, రాష్ట్రానికి చివరికి చేతిలో మిగిలింది చిప్పే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

రేవంత్ రెడ్డి చెప్పిన అవాస్తవ వాగ్దానాలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అసంబద్ధ హామీల వలన ప్రజల జీవితాలు సంక్షోభంలో పడినట్టు పేర్కొన్నారు. "ఒక్కసారి మోసపోతే అది మోసగాడి తప్పు, కానీ పదేపదే మోసపోతే అది మన తప్పవుతుంది. కాబట్టి ఈసారి ఎలాంటి ఎన్నిక వచ్చినా కాంగ్రెస్‌ను తిప్పికొట్టాలి" అని ప్రజలను హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి. "ఒకే తప్పును మళ్లీ చేయొద్దు. జీహెచ్ఎంసీతో పాటు రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించండి" అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రం మొత్తం దారుణంగా వెనుకబడుతున్నా, ఒక్క రేవంత్ రెడ్డీయే ఆనందంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. "రేవంత్ పాలన వలన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలే అసంతృప్తిగా ఉన్నారు. ఇక ప్రజల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇది వాళ్ల విఫల పాలన ఫలితమే" అని అన్నారు.
మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ప్రజల మధ్య తిరుగుతూ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తారని తరువాయి 2లో

# 30 రోజుల్లో దేశాన్ని వీడండి.. అమెరికా హెచ్చరిక



**అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం హెచ్చరించింది.**

**ఈ కబురు:** అమెరికాలో ఎక్కువకాలం నివసిస్తున్న విదేశీ జాతీయులు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ హెచ్చరికలు జారీ చేసింది. "అమెరికాలో 30 రోజులకు మించి నివసిస్తున్నవారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే.. నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు.అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి" అని ఎక్స్‌లో సందేశం ఉంచింది.
"సొంతంగా అమెరికాను వీడటమే ఉత్తమమైన మార్గం. మీ సామాను సర్దుకొని 2లో



# దేశంలో ఈ పని చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది

**ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన జీవోను తెలంగాణలో విడుదల చేయనున్నారు**
**ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం, దేశంలోనే తొలి రాష్ట్రంగా రికార్డ్ !**
**ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం, దేశంలోనే తొలి రాష్ట్రంగా రికార్డ్ !**

హైదరాబాద్ తెలంగాణలో సోమవారం నాడు కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ జీఓను విడుదల చేయనుంది. దాంతో దేశంలోనే ఎస్సీ వర్గీకరణ అమలు కోసం జీఓ విడుదల చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ రికార్డ్ క్రియేట్ చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపగా, ఆ బిల్లుకు గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఆమోదం తెలిపారు.

సచివాలయంలో ఎస్సీ వర్గీకరణ క్యాబినెట్ సబ్ కమిటీ తాజాగా సమావేశం అయింది. ఎస్సీ వర్గీకరణ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సబ్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ సోమవారం (ఏప్రిల్ 14న) ఉదయం 11 గంటలకు మరోసారి బేటీ కానుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రేపు ఉదయం ఎస్సీ వర్గీకరణ జి.ఓ విడుదల చేస్తామని తెలిపారు. జీవో మొదటి కాపీ 2లో

# ఎన్నికల రెఫరెండమే!

- 2029 అసెంబ్లీ ఎన్నికల్లో భూభారతే ప్రధానం
- నేడు భూభారతి పోర్టల్‌ను సీఎం ప్రారంభిస్తారు
- 3 జిల్లాల్లోని మూడు మండలాల్లో అమలు
- జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తాం
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి పొంగులేటి



**ఈ కబురు, హైదరాబాద్:**
వచ్చే 2029 శాసనసభ ఎన్నికలకు భూభారతి చట్టం, పోర్టల్‌ను రెఫరెండంగా స్వీకరిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పునరుద్ఘాటించారు. భూములున్న ప్రతి ఒక్కరికి భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా 'భూ భారతి'చట్టాన్ని, పోర్టల్‌ను తెస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.
సోమవారం నుంచే భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇకపై తరువాయి 2లో

# 'ఎల్‌ఆర్‌ఎస్' సాంకేతిక సమస్యల పరిష్కారానికి కసరత్తు

**లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) కింద తీసుకొచ్చిన వన్‌టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) దరఖాస్తుల్లోని సాంకేతిక సమస్యల పరిష్కారానికి పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది.**

**దరఖాస్తులు సాఫీగా ముందుకెళ్లేలా పురపాలక శాఖ చర్యలు**



**ఈ కబురు, హైదరాబాద్:**
లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) కింద తీసుకొచ్చిన వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) దరఖాస్తుల్లోని సాంకేతిక సమస్యల పరిష్కారానికి పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. లోపాల్ని ఎప్పటికప్పుడు సవరించేలా చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లోని ఎల్ 1 దశలో దస్త్రాన్ని ఆమోదించి ఎల్ 2 దశకు పంపితే ఎల్ 1 దశకే తిరిగి వస్తుండటం లాంటి సాంకేతిక సమస్యను ఈ నెల 8న అధికారులు గుర్తించారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సాంకేతిక బృందం దాన్ని సరిచేయడంతో ఎల్ 1 దశ నుంచి ఎల్ 2, ఎల్ 3 దశలకు దరఖాస్తులు సాఫీగా ముందుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. అలాగే రుసుం లెక్కింపులకు సంబంధించిన సమస్యలపైనా అధ్యయనం చేశారు. సాధారణంగా దరఖాస్తుదారులు ఇచ్చే వివరాల ఆధారంగానే ఆటో ఫీ జనరేట్ అవుతుంది. అయితే మార్కెట్ విలువ లేదా ప్లాటు విస్తీర్ణం తప్పుగా నమోదు చేస్తే ఆటో ఫీ సరిగ్గా 2లో

# బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం.. 8మంది మృతి

**కోటవురట్ల మండలం కైలాసపట్నంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.**



**అనకాపల్లి:** అనకాపల్లి జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో ఎనిమిది మంది మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుల్లో ఎక్కువ మంది తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన వారు ఎక్కువమంది ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

మృతుల వివరాలు ఇవీ.. మృతి చెందిన వారిలో 1. అప్పికొండ తాతబాబు (50), 2. సంగరాతి గోవింద్ (45), 3. దాడి రామలక్ష్మి (38), 4. దేవర నిర్మల (36), 5. పురం పాప (40), 6. గుంపిన వేణుబాబు (40), 7. శానవెల్లి బాబురావు(56) 8. చదలవాడ మనోహర్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరంతా బాణాసంచా తయారీ కేంద్రంలో కూలి పనికి వచ్చినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలిని అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. క్షతగాత్రుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయన.. క్షతగాత్రులను మెరుగైన చికిత్సకోసం కేజీహెచ్‌కు తరలించాలని ఆదేశించారు.

కోటవురట్ల మండల కేంద్రానికి మూడు కి.మీల దూరంలో ఈ విషాదం చోటుచేసుకుంది. తారాజువ్వల తయారీకి తరువాయి 3లో



## 30 రోజుల్లో దేశాన్ని వీడండి..

# అమెరికా హెచ్చరిక

మొదటి పేజి తరువాయి

విమానం ఎక్కండి. మీకు ఎటువంటి నేర నేపథ్యం లేకపోతే అమెరికాలో సంపాదించుకొన్న సొమ్మును దాచుకొని బయల్దేరండి'' అని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వెల్లడించింది. ఇలాంటి వారు విమాన టికెట్ సొమ్మును భరించలేకపోతే.. రాయితీ ఇచ్చేందుకు అమెరికా ఏర్పాట్లు చేసింది.

ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు.. ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్క రోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని. వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

ఈ నిర్ణయం నేరుగా హెచ్ 1బీ, విద్యార్థి పర్మిట్లపై ఉండేవారికి వర్తించదు. కానీ, సరైన అనుమతులు లేకుండా అమెరికాలో ఉండిపోయే వారిపై మాత్రం దీనిని కచ్చితంగా అమలు చేయనున్నారు. ఎవరైనా హెచ్ 1బీ వీసాపై వచ్చి ఉద్యోగం కోల్పోతే.. వారు నిర్ణీత సమయం దాటి అమెరికాలో ఉంటే మాత్రం చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. విద్యార్థి, హెచ్ 1బీ వీసాదారులు అమెరికా చట్టాలు సూచించిన అన్ని నిబంధనలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.



## దేశంలో ఈ పని చేసిన తొలి రాష్ట్రంగా

# తెలంగాణ నిలవనుంది

మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తామని చెప్పారు.

తాజాగా జరిగిన సమావేశంలో సబ్ కమిటీ వైస్ చైర్మన్, మంత్రి దామోదర్ రాజా నర్సింహ, సభ్యులు, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఏక సభ్య కమిషన్ చైర్మన్ శమీమ్ అక్తర్, సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**గత మార్చి నెలలో బిల్లు ఆమోదం**

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఈ మార్చి నెలలో ఆమోదం తెలిపింది. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశ పెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఇది గొప్ప విజయం అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. మరోవైపు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం కొనసాగుతోంది. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**6 దశాబ్దాల కిందటే దళితుడు సీఎం**

1960 లోనే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య లాంటి దళితున్ని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. దళితుడు మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ నియమించింది. పంజాబ్ కేసు సుప్రీం కోర్టులో సుదీర్ఘ కాలం కొనసాగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడుగురు జడ్జిల ముందు ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టులో మన వాదనలు వినిపించాం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే వర్గీకరణకు అనుకూలంగా తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశాం. అందుకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. వన్ మెన్ కమిషన్ ను ఏర్పాటు చేసి.. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆమోదించాం.

59 ఎస్సీ ఉపకులాలను 3 గ్రూపులుగా విభజించి 15 శాతం రిజర్వేషన్లు వారికి న్యాయం జరిగేలా పంచాం. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో ప్రాధాన్యం కల్పిస్తాం. 2026 జనగణన పూర్తి కాగానే ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని' సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# రేవంత్ లాంటి మోసగాడిని

## నమ్మినందుకు తెలంగాణ ఆగమైంది

మొదటి పేజి తరువాయి



కేటీఆర్ ప్రశంసించారు. ''డంపింగ్ యార్డ్ వంటి కీలక సమస్యలపై పోరాడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంచి నాయకుడిని గెలిపిస్తే, మంచి మార్పు సాధ్యమవుతుందని ఆయన నిరూపించారన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉంది..ఎన్నిక ఏదైనా, సందర్భం ఏదైనా - ఈసారి ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఆత్మ, తెలంగాణ స్వభిమానం కాపాడాలంటే, భరోసా నలుగురికీ కలిగించగల పార్టీ ఒక్కటే ఉంది - అది బీఆర్ఎస్ అని కేటీఆర్ పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ ఉత్సవాల విజయవంతానికి కేటీఆర్ పిలుపునిచ్చారు. ''ఈ నెల 27న పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం. ఒక పార్టీగా 25 సంవత్సరాల ప్రయాణం ఎలాంటి మైలురాయో ప్రతి కార్యకర్తకు అర్థమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇది రెండవ ఘనత సాధించిన పార్టీగా మన గర్వం'' అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ సభకు ముందు భారీ ర్యాలీ నిర్వహించి కార్యకర్తలు స్వాగతం పలికారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నేతలు కేటీఆర్ సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు.ఈ కబురు,మేడ్చల్ మల్కాజ్‌గిరి : తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాంటి మోసపూరిత నేతను నమ్మిన ఫలితంగా తీవ్రంగా మోసపోయారని, రాష్ట్రానికి చివరికి చేతిలో మిగిలింది చిప్పే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

# ఎన్నికల రెఫరెండమే!

మొదటి పేజి తరువాయి

ధరణి పోర్టల్ ఉండదని తెలిపారు. భూ భారతి అమలులోకి వచ్చిన తర్వాత ధరణి ముసుగులో జరిగిన భూ అక్రమా లపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. పోర్టల్ ప్రారంభం కాగానే ప్రజలంతా ఒకేసారి దానిని సందర్శించవద్దని, అలా చేస్తే పోర్టల్ ఆగిపోయే ప్రమాదం ఉందని మంత్రి చెప్పారు. కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పోర్టల్‌ను నిలుపుదల చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.



**తొలుత 3 మండలాల్లో భూభారతి**

భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను తొలుత మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతు న్నట్లు పొంగులేటి తెలిపారు. ధరణిలో తలెత్తిన సమస్యలు భూభారతిలో రాకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అచ్చుతప్పులు, భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, తండ్రి పేరు మార్పు, భూలావా దేవీల్లో అవకతవకలను సరిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ మూడు మండలాల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రమంతా ఈ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పారు.

ధరణిని తెచ్చిన సమయంలో దాదాపు 4 నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదని తెలిపారు. పార్ట్ బీలోని భూముల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ధరణిలో 33 మాడ్యూల్స్ ఉండగా, భూభారతిలో 6 మాత్రమే ఉంటాయని వెల్లడించారు. భూభారతి అమలు కోసం ఎంపికచేసిన గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. భూభారతిలో ఎమ్మార్వో స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు ఐదు స్థాయిల్లో భూ సమస్యల పరిష్కారానికి వీలుగా అధికారాల వికేంద్రీకరణ చేసినట్లు వివరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**మే మొదటివారంలో గ్రామ పాలనాధికారులు**

వచ్చేనెల మొదటివారంలో గ్రామాల్లో రెవెన్యూ పాలనా యంత్రాంగాన్ని పునరుద్ధరిస్తామని పొంగులేటి తెలిపారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వేయి మంది లైసెన్సుడ్ సర్వేయర్లను నియమిస్తామని మంత్రి ప్రకటించారు.

## 'ఎల్ఆర్ఎస్' సాంకేతిక సమస్యల

# పరిష్కారానికి కసరత్తు

మొదటి పేజి తరువాయి

జనరేట్ కాకపోవడంతో దరఖాస్తుదారుల్లో గందరగోళం నెలకొంటున్నట్లు గుర్తించారు. దీన్ని అధిగమించేందుకు దరఖాస్తులో ఫీ కరెక్షన్ మాడ్యూల్‌ను చేర్చారు. ఎల్ 2 దశలో ఇబ్బందులు తలెత్తితే పరిశీలన అనంతరం సవరించిన రుసుం అంచనా లేఖల్ని దరఖాస్తుదారులకు పంపే ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించిన దరఖాస్తుదారుల్లో అర్హులకు అవసరమైన ప్రొసీడింగ్స్‌ను ఎప్పటికప్పుడు జారీ చేస్తున్నారు. ఇప్పటివరకు 72,776 ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఈ నెల 8న సాంకేతిక సమస్యలను పరిష్కరించిన తర్వాత ఇప్పటివరకు 11,130 కొత్త ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు.. గత రెండు రోజుల్లోనే 5,100 ప్రొసీడింగ్స్ జారీ అయినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.



**ఎల్1 స్థాయిలో డెస్క్‌టాప్ వెర్షన్**

ఎల్ఆర్ఎస్ పథకాన్ని 2020లో ప్రారంభించి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత చేవెళ్ల, మొయినాబాద్, ఎదులాపూర్, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, కోహిర్, కేసముద్రం, అశ్వారావుపేట, స్టేషన్ ఘన్‌పూర్, మద్దూర్ గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా... మహబూబ్‌నగర్, మంచిర్యాల మున్సిపాలిటీలను మున్సిపల్ కార్పొరేషన్లుగా మార్చిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఎల్ 1 స్థాయిలో అధికారులు దరఖాస్తుల్ని సాఫీగా పరిష్కరించేందుకు డెస్క్‌టాప్ వెర్షన్ సదుపాయం కల్పించారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల కోసం 'ఆడ్ ఎఫ్‌టీఎల్/ ప్రొహిబిటెడ్' ట్యాబ్ ఏర్పాటు చేశారు. దరఖాస్తులను రెవెన్యూ లేదా ఇరిగేషన్ శాఖలకు పంపించి అవసరమైన అనుమతులు తీసుకునేలా దీన్ని రూపొందించారు.

**ఎల్2 స్థాయిలో ఫీ కరెక్షన్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. రుసుం లెక్కింపులకు సంబంధించి మైనస్ లేదా వాస్తవం కంటే ఎక్కువ చూపేందుకు ఆస్కారం లేకుండా దీన్ని రూపొందించారు.**



## అంబేడ్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ది

**భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఆయన అంత్యక్రియలు కూడా ఢిల్లీలో జరగనీయకుండా ముంబయికి తరలించడంతోపాటు అందుకు విమాన ఛార్జీలు చెల్లించాలంటూ అంబేడ్కర్ సతీమణికి బిల్లులు పంపించారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు.**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణ**

**కరీంనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేస్తున్న బండి సంజయ్**

**ఈ కబురు (కరీంనగర్), సికింద్రాబాద్,:** భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఆయన అంత్యక్రియలు కూడా ఢిల్లీలో జరగనీయకుండా ముంబయికి తరలించడంతోపాటు అందుకు విమాన ఛార్జీలు చెల్లించాలంటూ అంబేడ్కర్ సతీమణికి బిల్లులు పంపించారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ''హిందూకోడ్ బిల్లు, సామాజిక న్యాయ సాధికారత అంశాలపై తన అభిప్రాయాలను నెహ్రూ వ్యతిరేకించడంతో మనస్తాపానికి గురై అంబేడ్కర్ న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. తరువాత స్వయంగా అభ్యర్థులను నిలబెట్టి ఆయన్ను ఎన్నికల్లో ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది. భారతరత్న ఇవ్వకుండా అవమానించారు. ఆయన్ను ఎన్నికల్లో ఓడించిన వారికి పద్మభూషణ్ ఇచ్చి సత్కరించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు మోదీ సర్కారు కృషి చేస్తోంది. ఆయన చరిత్ర తెలిసేలా పంచతీర్థాలను ఏర్పాటు చేసింది. దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌కు, ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ములను రాష్ట్రపతి పదవితో గౌరవించింది. అంబేడ్కర్‌ను భారతరత్నతో గౌరవించడంతోపాటు పార్లమెంటు భవనంలో ఆయన చిత్రపటాన్ని, సుప్రీంకోర్టు, న్యాయ మంత్రిత్వశాఖలో విగ్రహాలను ఏర్పాటు చేసిన ఘనత భాజపాకే దక్కుతుంది'' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## 16 నుంచి సీఎం రేవంత్‌రెడ్డి

# జపాన్ పర్యటన



**రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 15వ తేదీ రాత్రి బయలుదేరనున్న ఆయన 16 నుంచి 22 వరకు అక్కడ పర్యటిస్తారు. 23న రాష్ట్రానికి తిరిగి రానున్నారు.**

**ఈ కబురు, హైదరాబాద్:** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 15వ తేదీ రాత్రి బయలుదేరనున్న ఆయన 16 నుంచి 22 వరకు అక్కడ పర్యటిస్తారు. 23న రాష్ట్రానికి తిరిగి రానున్నారు. ఆయన వెంట ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పర్యటనకు వెళుతున్నారు. ఈ బృందం జపాన్‌లోని టోక్యో, మౌంట్‌ఫుజి, ఓసాకా, హిరోషిమాల్లో పర్యటిస్తుంది. పర్యటనలో భాగంగా ఓసాకా వరల్డ్ ఎక్స్‌పో2025లో తెలంగాణ పెవిలియన్‌ను సీఎం ప్రారంభించనున్నారు. అలాగే జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు తదితరులతో బృందం సమావేశం కానుంది. తెలంగాణలో పెట్టుబడులు, పారిశ్రామిక, సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరుపుతుంది. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులు పెట్టడానికి గల అవకాశాలను, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను జపాన్ పర్యటనలో ప్రధానంగా వివరించనున్నారు.

నేడు కలెక్టర్లతో సదస్సు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కీలక పథకాలపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించే ఈ సదస్సులో.. ప్రధానంగా భూభారతి పోర్టల్ ప్రారంభం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, తాగునీటి పథకాలపై చర్చించనున్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. తాగునీటి సరఫరా ఎలా ఉంది.. ఏమైనా ఇబ్బందులున్నాయా.. పరిష్కారాలేమిటి.. తదితర అంశాలపై కలెక్టర్లను సీఎం అడిగి తెలుసుకోనున్నారు. అలాగే భూభారతి పోర్టల్‌తో తెస్తున్న మార్పులు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యలు, లబ్ధిదారుల ఎంపిక, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా.. ఇంతవరకూ మంజూరైన ఇళ్ల నిర్మాణాల తీరు.. మొదటిదశలో చెల్లింపులు.. వంటి అంశాలపై కలెక్టర్లతో సీఎం సమీక్షించనున్నారు. మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ సదస్సులో పాల్గొంటారు. సదస్సు అనంతరం శిల్పకళావేదికలో సీఎం భూభారతి పోర్టల్‌ను ప్రారంభించనున్నారు.



## సంక్షేమంలో దేశానికే

# తెలంగాణ ఆదర్శం

**సంక్షేమంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 'పెద్ద సంఖ్యలో ఇన్ని సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నారని.. అన్ని రాష్ట్రాలూ మనవైపు చూస్తుండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి గర్వకారణం' అని పేర్కొన్నారు.**

**పాడారు తప్ప ఇవ్వలేదు**
**జూన్ 2 నుంచి రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**మధిరలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. పక్కన నాయుడు సత్యనారాయణ, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**

**ఈ కబురు:** సంక్షేమంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 'పెద్ద సంఖ్యలో ఇన్ని సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నారని.. అన్ని రాష్ట్రాలూ మనవైపు చూస్తుండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి గర్వకారణం' అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిరలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''గత పాలకులు పదేళ్లపాటు సన్నబియ్యం సన్నాయి సంగీతం పాడారు తప్ప ఇవ్వలేదు. రేషన్ దుకాణాల్లో ప్రస్తుతం 90 లక్షల కార్డుల ద్వారా 2.85 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. కొత్తగా వచ్చేవాటితో కలిపి మొత్తం కోటి కార్డుల ద్వారా 3.10 కోట్ల మంది లబ్ధి పొందుతారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత, అంకితభావానికి ఈ పథకం నిదర్శనం. నిరుద్యోగుల కోసం రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పేరిట నూతన స్వయం ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టాం. మూడు నుంచి వారం రోజులపాటు శిక్షణ ఇచ్చి ఈ పథకాల గ్రౌండింగ్ పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తాం.

గత పాలకులు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి అప్పగించారు. వాటన్నింటినీ సరిచేసుకుంటూ, ప్రజలకు సంక్షేమం అందించడంలో ఎక్కడా వెనక్కి తగ్గడంలేదు. రైతు రుణమాఫీ కోసం రూ.21 వేల కోట్లు, రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు, సన్నధాన్యం బోనస్‌కు రూ.2,675 కోట్లు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ కోసం రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నిరుద్యోగ యువతకు ఏడాదిలో 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేశాం. మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేశాం'' అని భట్టి వివరించారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తెలంగాణ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# బిల్డర్ల సమస్యల పరిష్కారానికి సిద్ధం

**మరో సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఆసియాగా హైదరాబాద్**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**ఈ కబురు, హైదరాబాద్:** బిల్డర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంలో బిల్డర్లు ఎప్పటికీ భాగస్వాములుగానే ఉంటారని ఆయన స్పష్టం చేశారు. బిల్డర్లకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని హామీ ఇచ్చారు. హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో ఆదివారం జరిగిన సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ (సీబీఏ) తొలి వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధి నుంచి ప్రతీ బిల్డర్ ప్రయోజనాన్ని పొందాలని ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి బిల్డర్లు కృషి చేయాలని సూచించారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసిందని, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఔటర్‌రింగ్ రోడ్డు, కృష్ణా-గోదావరి జలాల తరలింపు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు.

ప్రస్తుతం ఈ అభివృద్ధిని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ప్రజా రవాణా మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ అభివృద్ధి ఇందులో భాగమేనని వివరించారు. హైదరాబాద్ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోందని వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పెట్టుబడులను మరింత ఆకర్షించేందుకు సరైన, సమర్థవంతమైన పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌ను మరో సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఆసియాగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి – వందేళ్ల దృష్టితో అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్ సహా పలువురు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

**జూన్ 2 నాటికి భూభారతి అమలు: మంత్రి పొంగులేటి**
ముందుగా మూడు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి అమలు చేస్తామని తెలిపారు. శాసనసభ ఎన్నికలకు ఇది రెఫరండం అవుతుందన్నారు. మే మొదటి వారంలో గ్రామపాలనాధికారులను నియమిస్తామని చెప్పారు.

# కాలయాపన ఇంకెన్నాళ్లు?..

## టన్నెల్‌లో చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి?: హరీశ్‌రావు

**ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.**



**ఈ కబురు,హైదరాబాద్:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రమాదం జరిగి 50 రోజులైనా ప్రభుత్వ నిర్లక్ష్యం బాధాకరమని.. టన్నెల్ వద్ద కుటుంబ సభ్యుల ఆవేదన అరణ్య రోదనగా మిగిలిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం 8 మంది కుటుంబాల్లో విషాదం నింపిందని చెప్పారు. బాధితులను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

''కాంగ్రెస్ నాయకులు పబ్లిసిటీ కోసం టన్నెల్ వద్దకు వెళ్లి రావడం తప్ప ఇప్పటి వరకు చేసిందేం లేదు. ఒకసారి సమీక్ష చేయడం తప్ప చిత్తశుద్ధితో పరిష్కార మార్గం కోసం ప్రయత్నించింది లేదు. సహాయక బృందాలను సమన్వయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర ఆలస్యం జరిగింది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి చరిత్రలో నిలిచిపోయే అప్రతిష్ఠ. ఇంకెన్ని రోజులు కాలయాపన చేస్తారు? లోపల చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి? కూటి కోసం, కూలీ కోసం తెలంగాణకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా నిలవాలి. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలి. వాస్తవాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం.. 8 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

పేరొందిన ఈ కర్మాగారంలో బాణసంచా తయారు చేస్తున్న సమయంలో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ పేలుడు ధాటికి నిర్మాణం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. క్షతగాత్రుల్లో ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఘటనా స్థలం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడు సమయంలో పరిశ్రమలో 15మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది, ఈ ఘటనపై కలెక్టర్ విజయకృష్ణన్ విచారణకు ఆదేశించారు.

**సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి**
కోటవురట్ల మండలంలో విషాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత, కలెక్టర్, ఎస్పీలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని సీఎంకు అధికారులు వివరించారు. మరోవైపు, ఈ ఘటనపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని నర్సీపట్నం ఆర్డీవోను ఆదేశించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని ఆయన అప్రమత్తం చేశారు. బెడ్లు, వెంటిలేటర్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



**పవన్ తీవ్ర విచారం**
కోటవురట్ల ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హోంమంత్రి అనితతో ఫోన్‌లో మాట్లాడి ఈ ఘటనపై ఆరా తీశారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి అనిత**
బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనపై ఏపీ హోంమంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందిని ఆమె అప్రమత్తం చేశారు. బాణసంచా పరిశ్రమ వద్దకు బయల్దేరిన ఆమె.. ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి లోకేశ్**
బాణసంచా పరిశ్రమలోఅగ్నిప్రమాదం ఘటనపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించడం దురదృష్టకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్న ఆయన.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# పండగ వేళ విరుచుకుపడ్డ రష్యా..

# 20 మందికిపైగా మృతి!

**ఉక్రెయిన్‌లోని సుమీ నగరంపై రష్యా జరిపిన క్షిపణుల దాడిలో 20 మందికిపైగా మృతి చెందారు.**



**ఈ కబురు:** ఉక్రెయిన్ పై రష్యా మరోసారి విరుచుకుపడింది. సుమీ నగరంపై జరిపిన క్షిపణుల దాడిలో 20 మందికిపైగా మృతి చెందారు. స్థానిక తాత్కాలిక మేయర్ ఆర్టెమ్ కొబ్జార్ ఈ వివరాలను వెల్లడించారు. మట్టల ఆదివారం సందర్భంగా స్థానికులంతా ఒకచోట చేరిన వేళ రెండు క్షిపణి దాడులు జరిగాయని తెలిపారు. పండగ వేళ మహా విషాదం చోటుచేసుకుందని సామాజిక మాధ్యమాల వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడుల నిలిపివేతకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిన తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించారని రష్యా, ఉక్రెయిన్ అగ్ర దౌత్యవేత్తలు పరస్పరం ఆరోపించుకున్న వేళ దాడులు చోటుచేసుకున్నాయి.

సుమీ నగరంపై దాడులను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకున్నారని, ఈ దాడుల్లో నివాస భవనాలు, విద్యాసంస్థలు, కార్లు వంటివి ధ్వంసమయ్యాయని మండిపడ్డారు. పదుల సంఖ్యలో పౌరులు మృతి చెందారని చెప్పారు. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు స్పందించాలని డిమాండ్ చేశారు. మాస్కో సరిగ్గా ఇటువంటి ఉగ్రచర్యలనే కోరుకుంటోందని, యుద్ధాన్ని లాగుతోందని ఆరోపించారు. రష్యాపై ఒత్తిడి లేకుండా.. శాంతి స్థాపన అసాధ్యమన్నారు. మాస్కో విషయంలో చర్చలు ఎప్పుడూ క్షిపణులు, వైమానిక దాడులను నిలువరించలేకపోయాయని, ఓ ఉగ్రవాదితో ఏ విధంగా వ్యవహరిస్తారో.. రష్యా పట్ల అటువంటి వైఖరి అవసరమన్నారు.




10కె రన్ లో ఉత్సాహంగా పాల్గొంటున్న ఔత్సాహికులు




విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## హోండా బిగ్ వింగ్ డీలర్ షిప్ ల ఆధ్వర్యంలో 10కె రన్

**పాల్గొన్న 2వేల మంది ఔత్సాహికులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** అత్యవసర ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తూ హోండా బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌ల ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 10కె రన్ ఉత్సాహంగా కొనసాగింది. హోండా బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లైన ఆటోఫిన్ హోండా బిగ్‌వింగ్, జెఎస్పీ హోండా బిగ్‌వింగ్, ఫార్చ్యూన్ హోండా బిగ్‌వింగ్ లు సంయుక్తంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాయి. గచ్చిబౌలి జీఎంసీ బలయోగి స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఔత్సాహికుల నుంచి విశేష స్పందన లభించింది. రన్ లో 2 వేలకు పైగా రనర్లు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫిట్‌నెస్ మీద ఆసక్తి ఉన్నవారితో పాటు ఆరోగ్య సంరక్షణ రంగంలోని నిపుణులు, ఇతర రంగాల ప్రతినిధులు ఒక్కటై కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్చ్యూన్ హోండా ప్రతినిధి నిరవ్ మోడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అత్యవసర ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించామని, హోండా బిగ్‌వింగ్ చేసిన ఈ ప్రయత్నం ఒక గొప్ప ముందడుగుగా నిలుస్తుందని, ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమం నిర్వహించడానికి ప్రయత్నం చేస్తామన్నారు..ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన నగదు మొత్తం ఆరోగ్య సంరక్షణకు ఉపయోగించడం జరుగుతుందన్నారు.





## సుడాన్ లో దారుణం..కరువు పీడిత శిబిరాలపై దాడులు..కుప్పలుగా శవాలు

**ఈ కబురు:** దక్షిణ ఆఫ్రికా దేశమైన సుడాన్ లో పారామిలిటరీ దళాలు విధ్వంసం సృష్టించాయి. ఉత్తర డార్ఫర్ రాష్ట్రంలోని ఎల్ ఫాషర్ లో కరువు పీడిత శిబిరాలపై పారామిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో దాదాపు 100మందికి పైగాన పౌరులు మృతిచెందారు. మృతుల్లో 20 మంది చిన్నారులు ,9మంది ఆరోగ్య సహాయక సిబ్బంది ఉన్నారు.

గత రెండు రోజులుగా ఎల్ ఫాషర్ సిటీకి సమీపంలోని జాంజామ్, అబూ శౌఖ్ శిబిరాలపై పారామిలిటరీ దళాలు విరుచుపడ్డాయి.జాంజామ్ శిబిరంలో 9మంది ఆరోగ్య సిబ్బందిని కాల్చిచంపారని సుడాన్ లోని నివాసి ,మానవతా సమన్వయకర్త క్లెమెంటైన్ న్క్వేటాసలామి తెలిపారు.

ఈ దాడి కారణంగా దాదాపు 2వేల400 మంది శిబిరాలు, ఎల్‌ఫాషర్ నుంచి పారిపోవాలి. ఈ నగరం ఇప్పటికీ సూడాన్ సైన్యం నియంత్రణలో ఉంది. ఇది ఏప్రిల్ 2023లో అంతర్యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి RSFతో పోరాడుతోంది. ఈ సంఘర్షణలో 24వేలమందికి పైగా మరణించారని UN ప్రకటించింది.




### రేపు బ్యాంకులకు సెలవు

# ఎందుకంటే?

**'అంబేద్కర్ జయంతి'ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 14ను జాతీయ సెలవు దినంగా అధికారికంగా ప్రకటించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా సోమవారం దేశంలోని అన్ని బ్యాంకులకు సెలవు దినంగా పేర్కొంది. అంటే అన్ని బ్యాంకులు మూసి ఉంటాయన్నమాట.**

బ్యాంకులు అన్నీ క్లోజ్ అయినప్పటికీ.. ఆన్‌లైన్ బ్యాంకింగ్ (ఇంటర్నెట్ బ్యాంకింగ్, డిజిటల్ బ్యాంకింగ్ మొదలైనవి) సేవలన్నీ కూడా అందుబాటులో ఉంటాయి. బ్యాంకులకు వెళ్లి చేసుకోవలసిన పనులన్నీ ఎల్లుండికి (మంగళవారం) వాయిదా వేసుకోవాలి.

**ఇతర సెలవు దినాలు**

- 15 ఏప్రిల్: బెంగాలీ నూతన సంవత్సరం, భోగ్ బిహు (అసోం, పశ్చిమ్ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లోని బ్యాంక్‌లకు సెలవు)
- 18 ఏప్రిల్: గుడ్ ఫ్రైడే (ఛండీగఢ్, త్రిపుర, అసోం, రాజస్థాన్, జమ్ము, హిమాచల్ ప్రదేశ్, శ్రీనగర్‌లోని బ్యాంక్‌లకు సెలవు)
- 20 ఏప్రిల్: ఆదివారం
- 21 ఏప్రిల్: గరియా పూజ (త్రిపురలోని బ్యాంక్‌లకు సెలవు)
- 26 ఏప్రిల్: నాల్గవ శనివారం
- 27 ఏప్రిల్: ఆదివారం
- 29 ఏప్రిల్: పరశురామ జయంతి (హిమాచల్ ప్రదేశ్‌లోని బ్యాంక్‌లకు సెలవు)
- 30 ఏప్రిల్: బసవ జయంతి, అక్షయ తృతీయ (కర్ణాటకలోని బ్యాంక్‌లకు సెలవు)



### పాత బైక్ ధరకే 2025

# సుజుకి హయబుసా

**సుజుకి మోటార్‌సైకిల్ కంపెనీ ఇండియన్ మార్కెట్లో విక్రయిస్తున్న ఖరీదైన బైకులలో సుజుకి హయబుసా ఒకటి. దీనిని కంపెనీ OBD2B నిబంధనలకు అనుగుణంగా అప్డేట్ చేసింది. అయితే ఈ అప్డేట్ బైక్ ధరలో మాత్రమే ఎలాంటి మార్పు లేదు. అంటే ఈ కొత్త బైక్.. పాత బైక్ ధరకే అందుబాటులో ఉందన్నమాట.**

2025 సుజుకి హయబుసా బైక్ ధర రూ. 16.90 లక్షలు (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ). చూడటానికి మునుపటి బైక్ మాదిరిగా అనిపించినప్పటికీ.. ఉద్గార నియమాలకు అనుగుణంగా అప్డేట్ అయింది. ఈ బైక్ అదే 1340 సీసీ ఇంజిన్ ద్వారా 190 హార్స్ పవర్, 150 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది.

కొత్త హయబుసా ఇప్పుడు మెటాలిక్ మ్యాట్ స్టీల్ గ్రీన్/గ్లాస్ స్పార్కిల్ బ్లాక్, గ్లాస్ స్పార్కిల్ బ్లాక్/మెటాలిక్ మ్యాట్ టైటానియం సిల్వర్, మెటాలిక్ మిస్టిక్ సిల్వర్/పెర్ల్ వైగర్ బ్లూ అనే కొత్త డ్యూయెల్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.

# డజను మంది మాజీ ఉద్యోగులు న్యాయపోరాటం

**ఓపెన్‌ఏఐ లాభాపేక్షలేని సంస్థగా ప్రారంభమై క్రమంగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోందని కంపెనీకి చెందిన 12 మంది మాజీ ఉద్యోగులు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎలాన్ మస్క్ ఓపెన్‌ఏఐతో తన న్యాయ పోరాటాన్ని ఉద్ధృతం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మాజీ ఉద్యోగులు సైతం ఓపెన్‌ఏఐ పూర్తి లాభాపేక్ష సంస్థగా మారకుండా నిరోధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.**



లాభాపేక్షలేని సంస్థగా ప్రారంభమైన ఓపెన్‌ఏఐ ప్రస్తుత మార్కెట్ విధానాలతో ప్రాథమికంగా దాని లక్ష్యాన్ని ఉల్లంఘిస్తుందని మాజీ ఉద్యోగులు ఇటీవల ఫెడరల్ కోర్టు ఫైలింగ్‌లో వివరాలు వెల్లడించారు. ఇది నాన్‌ప్రాఫిట్ ఏఐ అభివృద్ధి సంస్థ నిబంధనలను అతిక్రమిస్తుందని తెలిపారు. సంస్థలో తాము చాలాకాలం పాటు సాంకేతిక, పాత్రలను నిర్వహించామని చెప్పారు. లాభాపేక్ష లేని పర్యవేక్షణ అనేది గతంలో మొత్తం కంపెనీ వ్యూహానికి కీలకంగా మారిందని చెప్పారు. దాంతో చాలామందికి కంపెనీ ప్రతిపాదన నచ్చి రిక్రూట్‌మెంట్ ఊపందుకుందని తెలిపారు. కానీ సంస్థ క్రమంగా తన వైఖరి మార్చుకుందని పేర్కొన్నారు.

ఓపెన్‌ఏఐ సహవ్యవస్థాపకుల్లో ఎలాన్ మస్క్ ఒకరు. 2015 నుంచి 2018 వరకు తాను ఈ సంస్థలో ఉన్నారు. తర్వాత కొన్ని కారణాల వల్ల దీన్ని వీడారు. ఓపెన్ ఏఐ పూర్తిగా లాభాపేక్ష సంస్థగా మారకుండా నిరోధించడానికి మస్క్ గతంలో కాలిఫోర్నియాలోని నార్తర్న్ డిస్ట్రిక్ట్ కోర్టులో ప్రాథమిక నిషేధాన్ని దాఖలు చేశారు. ఓపెన్‌ఏఐ పోటీ వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని అందులో పేర్కొన్నారు. దానివల్ల తన సొంత ఏఐ కంపెనీ 'ఎక్స్‌ఏఐ' నిధులు కోల్పోతుందని ఆరోపించారు. మరోవైపు ఇన్వెస్టర్ల నుంచి నిధులను సమీకరించడానికి లాభాపేక్షలేని సంస్థ పాత్రను తొలగించాల్సిన అవసరం ఉందని ఓపెన్‌ఏఐ వాదిస్తుంది.

# హైరింగ్ ప్రణాళికల్లో కంపెనీలు...

- సానుకూలంగా 45% సంస్థలు
- మిడ్–లెవెల్, కాంట్రాక్ట్ ఉద్యోగాలకు డిమాండ్
- జీనియస్ కన్సల్టెంట్స్ నివేదిక

**ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున కంపెనీలు నియామకాలు చేపట్టే యోచనలో ఉన్నాయి. 45 శాతం సంస్థలు కొత్తగా పర్మనెంట్ ఉద్యోగులను తీసుకునే ప్రణాళికల్లో ఉన్నాయి. వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్, హెచ్‌ఆర్ సేవల సంస్థ జీనియస్ కన్సల్టెంట్స్ నిర్వహించిన 'హైరింగ్, కాంపన్సేషన్, అట్రిషన్ మేనేజ్‌మెంట్ అవుట్‌లుక్ సర్వే 2025–26' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. వివిధ పరిశ్రమలవ్యాప్తంగా 1,520 మంది సీఎక్స్‌వోలు, సీనియర్ అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు.**



ఈ నివేదిక ప్రకారం 45 శాతం సంస్థలు కొత్తగా పర్మనెంట్ ఉద్యోగులను తీసుకువాలని భావిస్తుండగా 13 శాతం కంపెనీలు ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులు లేక ఖాళీ కాబోతున్న పోస్టులను భర్తీ చేసుకునే ప్రణాళికల్లో ఉన్నాయి. కానీ మరికొన్ని సంస్థలు హైరింగ్ విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హైరింగ్ ప్రణాళికలేమీ లేవని 16 శాతం సంస్థలు తెలిపాయి.

**తాత్కాలిక స్టాఫింగ్ వైపు మొగ్గు..**

తాత్కాలిక కొలువులకు కూడా డిమాండ్ పెరుగుతోంది. 26 శాతం కంపెనీలు టెంపొరరీ, కాంట్రాక్ట్ లేదా ప్రాజెక్ట్ ఆధారిత పనుల కోసం ఉద్యోగులను తీసుకునే యోచనలో ఉన్నాయి. గిగ్ వర్కర్లు, కాంట్రాక్ట్ అధారిత ఉద్యోగులు, అడ్వైజరీ సేవలందించే వారిని హైరింగ్ చేసుకోవాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. పర్మనెంట్ ఉద్యోగులకు బదులుగా తాత్కాలిక సిబ్బందిని తీసుకునే ధోరణి పెరుగుతోందనడానికి ఇది నిదర్శనమని సర్వే పేర్కొంది. సర్వేలో పాల్గొన్న సంస్థల్లో 37 శాతం కంపెనీలు మిడ్-లెవెల్ నిపుణులను నియమించుకోనున్నట్లు తెలిపాయి.


మరోవైపు, 19 శాతం కంపెనీలు ఎంట్రీ లెవెల్ ఉద్యోగులను తీసుకోవాలని భావిస్తుండగా, 18 శాతం సంస్థలు సీనియర్ లీడర్‌షిప్ స్థానాల్లోకి సిబ్బందిని నియమించుకునే యోచనలో ఉన్నాయి. 'ఆర్థిక అనిశ్చితులను దాటుకుంటూ కంపెనీలు ముందుకెళ్తున్న క్రమంలో ప్రతిభావంతులైన నిపుణులకు డిమాండ్ నెలకొంది. మిడ్-సీనియర్ ప్రొఫెషనల్స్‌కి భారీగా డిమాండ్ ఉండటంతో అట్రిషన్ (ఉద్యోగుల వలసలు) రిస్క్‌లను అధిగమించి, సిబ్బందిని అట్టే పెట్టుకోవడంపై కంపెనీలు ఫోకస్ చేయాల్సి ఉంటుంది. 2025-26లో కంపెనీలు సమర్థవంతమైన విధంగా హైరింగ్ ప్రణాళికలను వేసుకునేందుకు ఈ విశేషాలు ఉపయోగపడతాయి' అని జీనియస్ కన్సల్టెంట్స్ చైర్మన్ ఆర్‌పీ యాదవ్ చెప్పారు.

**మరిన్ని విశేషాలు..**

- 53 శాతం కంపెనీలు హైరింగ్ వృద్ధి ఒక మోస్తరుగా 5-10 శాతం స్థాయిలో ఉంటుందని అంచనా వేస్తున్నాయి. మరోవైపు 33 శాతం కంపెనీలు 10-15 శాతం అధికంగా నియామకాలు చేపట్టాలని భావిస్తున్నాయి.
- పరిశ్రమలవారీగా చూస్తే రిటైల్, క్యూ-కామర్స్‌లో అత్యధికంగా 21 శాతం కంపెనీలు నియామకాలు చేపట్టనున్నాయి. లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ విభాగాల్లోనూ సుమారు 9 శాతం సంస్థలు సిబ్బందిని తీసుకోనున్నాయి.
- ఆటోమొబైల్స్, ఎలక్ట్రిక్ వాహనాల విభాగాల్లో రిక్రూట్‌మెంట్ అధికంగా ఉంటుందని 15 శాతం కంపెనీలు భావిస్తున్నాయి. రెన్యూవబుల్స్, ఎనర్జీ, ఇంజినీరింగ్ ప్రాజెక్టుల విభాగాల్లో 11 శాతం కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నాయి.
- ఐటీ సర్వీసులు, టెలికం, టెక్నాలజీ విభాగాల్లో 13 శాతం, తయారీ, ఇంజినీరింగ్‌లో 11 శాతం, ఇన్‌ఫ్రా, రవాణా, రియల్ ఎస్టేట్‌లో 10 శాతం, బీఎఫ్‌ఎస్‌ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా)లో 9 శాతం సంస్థలు హైరింగ్ యోచనలో ఉన్నాయి.
- ఇక, ఎఫ్‌ఎంసీజీ, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, మీడియా..ఎంటర్‌టైన్‌మెంట్, విద్య తదితర రంగాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం హైరింగ్ ఒక మోస్తరుగానే ఉండవచ్చని అంచనా.

# యూఎస్‌లో ఐఫోన్లు ఎందుకు తయారు చేయరంటే..

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్థానికంగా తయారీని పునరుద్ధరించడానికి సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. చైనా వంటి దేశాల్లో భారీగా తయారవుతున్న యాపిల్ వంటి అమెరికన్ కంపెనీల ఉత్పత్తులపై ఈ ప్రభావం పడుతుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కంపెనీ కూడా చాలాకాలంగా ఈమేరకు సుంకాల నుంచి మినహాయింపు కావాలని యూఎస్‌ను కోరుతుంది. దాంతో అమెరికా ఇటీవల ఫోన్లు, కంప్యూటర్లను ప్రతీకార సుంకాల నుంచి మినహాయిస్తున్నట్లు ప్రకటించింది. అయితే అసలు యాపిల్ కంపెనీ తన ఉత్పత్తులను ఎందుకు యూఎస్‌లో తయారు చేయదో నిపుణులు విశ్లేషిస్తున్నారు.**



అమెరికాలో ఐఫోన్ల తయారీ అంత సులభం కాకపోవచ్చనే అభిప్రాయాలున్నాయి. 2011 ఫిబ్రవరిలో కాలిఫోర్నియాలో జరిగిన ఓ ప్రైవేట్ సమావేశంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, యాపిల్ సీఈఓ స్టీవ్ జాబ్స్ సహా సిలికాన్ వ్యాలీలోని అత్యంత ప్రభావవంతమైన నాయకులు పాల్గొన్నారు. అందులోని సారాంశాన్ని 2012లో న్యూయార్క్ టైమ్స్ హైలైట్ చేసింది. స్టీవ్ జాబ్స్ 2011 అక్టోబర్‌లో మరణించడానికంటే కొన్ని నెలల ముందు ఈ సమావేశం జరిగింది. అందులో స్టీవ్ జాబ్స్ మాట్లాడుతున్న సమయంలో అమెరికాలో ఐఫోన్లు తయారు చేయడానికి ఏమి కావాలని ఒబామా ఒక ప్రశ్న అడిగారు. దానికి స్పందించిన స్టీవ్‌జాబ్స్ నిర్మొహమాటంగా యాపిల్ తయారీకి యూఎస్ కంటే ఇతర దేశాలే అనుకూలంగా ఉన్నాయని తెలిపారు.

యాపిల్ ఇతర దేశాల్లో ఉత్పత్తులను తయారు చేసేందుకు గల కొన్ని కారణాలను మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చైనా వంటి దేశాలు దశాబ్దాలుగా అత్యంత ప్రత్యేకమైన తయారీ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఇందులో నైపుణ్యం కలిగిన కార్మికులు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాయి. యూఎస్‌లో లేబర్, ఉత్పత్తి ఖర్చులు ఇతర దేశాలతో పోలిస్తే అధికంగా ఉంటాయి. అమెరికాలో ఐఫోన్లు తయారైతే వాటి ధర మూడింతలు అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్‌లో కూడా ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీల ద్వారా యాపిల్ ఉత్పత్తులను తయారు చేస్తోంది.

# సోషల్ మీడియా సలహాలతో జాగ్రత్త

**ఇన్వెస్టర్లకు సెబీ హెచ్చరికలు**

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ (ఎస్‌ఎంపీలు) ద్వారా సెక్యూరిటీ మార్కెట్ల సంబంధిత కుట్రపూరిత కార్యకలాపాలు జరుగుతున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పేర్కొంది. దీంతో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాలని హెచ్చరించింది. ఎస్‌ఎంపీల ద్వారా సెక్యూరిటీ మార్కెట్ల మోసాలు అధికమయ్యాయని తెలియజేసింది. కేవలం సెబీ వద్ద రిజిస్టరైన ఇంటర్‌మీడియరీల ద్వారా లావాదేవీలకు ప్రాధాన్యత ఇవ్వమంటూ పబ్లిక్‌కు సూచించింది.



పెట్టుబడులు చేపట్టేందుకు అధీకృత ట్రేడింగ్ యాప్స్‌ను మాత్రమే వినియోగించుకోమంటూ సలహా ఇచ్చింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్(ట్విటర్), టెలిగ్రామ్, గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ తదితర సుప్రసిద్ధ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఇటీవల మోసపూరిత సలహాలు, లావాదేవీలు అధికమైన నేపథ్యంలోసెబీ తాజా హెచ్చరికలు జారీ చేసింది.

వీటి ద్వారా ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు ఎడ్యుకేషనల్ కంటెంట్ ఆఫర్ చేస్తున్నట్లు సెబీ తెలియజేసింది. దీనిలో భాగంగా తప్పుదారి పట్టించే కాల్స్, మోసపూరిత డాక్యుమెంట్లు, తప్పనిసరిగా లేదా రిస్క్‌లేని లాభాల అక్రమ హామీలు వంటివి ఇన్వెస్టర్లకు ఎరగా వేస్తున్నట్లు వివరించింది. అంతేకాకుండా రిజిస్టర్‌కాకుండానే పెట్టుబడి సలహాలు, సెబీ నకిలీ రిజిస్ట్రేషన్ సరిటిఫికెట్లు వంటివి వినియోగిస్తున్నట్లు వెల్లడించింది.

మరికొన్ని సందర్భాలలో సెబీ రిజిస్టర్డ్ ప్లాట్‌ఫామ్స్ పేరిట మోసాలకు తెరతీస్తూ అధిక రిటర్నుల ఆశ చూపుతూ ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు ప్రయతిస్నస్తున్నట్లు వివరించింది. ఇందుకు వాట్సాప్, టెలిగ్రామ్ చానళ్లలో తప్పుడు గ్రూప్‌లను సైతం సృష్టించడం ద్వారా మోసపుచ్చుతున్నట్లు పేర్కొంది. వెరసి నకిలీ సలహాదారులపట్ల అప్రమత్తంగా వ్యవహరించవలసిందిగా ఇన్వెస్టర్లను మరోసారి సెబీ హెచ్చరించింది!




# అదానీ గ్రూప్‌లో రూ. 2,165 కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ:** డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ చేపట్టిన బాండ్ల జారీలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్ భారీగా ఇన్వెస్ట్ చేసింది. అదానీ గ్రూప్ 75 కోట్ల డాలర్ల( రూ. 6,500 కోట్లు) విలువైన బాండ్ల జారీని చేపట్టగా.. 25 కోట్ల డాలర్ల(సుమారు రూ. 2,165 కోట్లు)తో సబ్‌స్క్రయిబ్ చేసినట్లు తెలుస్తోంది.

సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం 3-5ఏళ్ల కాలపరిమితితో అదానీ గ్రూప్ ఈ బాండ్లు విడుదల చేసింది. కాగా.. గతేడాది నవంబర్‌లో లంచం ఆఫర్ చేసిన కేసు నమోదుకావడంతో అదానీ గ్రూప్‌పై యూఎస్ న్యాయశాఖ పరిశోధనకు తెరతీసింది. ఈ నేపథ్యంలో అదానీ గ్రూప్ బాండ్లలో బ్లాక్‌రాక్ పెట్టుబడులకు ప్రాధాన్యత ఏర్పడినట్లు పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి.



# 'హీరోలతో సమానంగా పేరు తెచ్చుకున్న హీరోయిన్ ఆమె ఒక్కరే'



**కల్యాణ్ రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో వస్తోన్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ చిత్రానికి ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు.ఈ మూవీలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 18న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు. శనివారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సీనియర్ నటి విజయశాంతిపై ప్రశంసలు కురిపించారు.**

జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ..' నేను, అన్న నిల్చున్నప్పుడు ఇలాంటి వేదికలపై నాన్న వచ్చి మాట్లాడేవారు. ఈ రోజు విజయశాంతి మాట్లాడుతుంటే మా నాన్న లేరనే లోటు భర్తీ అయిపోయింది. చాలామంది హీరోలు అభిమానులను సంపాదించుకున్నారు. కానీ ఏ మహిళ కూడా విజయశాంతి లాగా గొప్పదనం సాధించలేదు. తెలుగు సినీ చరిత్రలోనే కాదు.. భారతదేశవ్యాప్తంగా హీరోలతో సమానంగా ఎదిగిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే విజయశాంతి ఒక్కరే. కర్తవ్యం, ప్రతిఘటన, మగ రాయుడు లాంటి ఎన్నో గొప్ప కథలు, పాత్రలు చేసిన మరో నటి ఇండియాలోనే లేదు. ఈ ఘనత కేవలం ఆమెకు మాత్రమే దక్కింది. 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' సినిమా కథ కర్తవ్యం మూవీలో వైజయంతికి ఓ కొడుకు పుడితే ఎలా ఉంటుందో అనే ఐడియాతోనే ఈ కథ పుట్టినట్టు ఉంది' అని విజయశాంతిపై ప్రశంసలు కురిపించారు.

# నాని సినిమా.. పిల్లలకు నో ఎంట్రీ!



**నాని అంటే కుర్రాళ్ల దగ్గర నుంచి ఫ్యామిలీస్ వరకు నచ్చే హీరో. కానీ గత కొన్నాళ్ల నుంచి ట్రెండ్ కి తగ్గట్లు తను కూడా మారుతున్నాడు. యాక్షన్ మూవీస్ చేస్తూ వస్తున్నాడు. ఇతడు హీరోగా నటించిన లేటెస్ట్ మూవీకి తాజాగా సెన్సార్ జరగ్గా.. పిల్లలు, సున్నిత మనస్కులకు నో ఎంట్రీ అనే టాక్ వినిపిస్తోంది.**

చాన్నాళ్ల క్రితమే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నాని.. హిట్ 3 గురించి హింట్ ఇచ్చేశాడు. యాక్షన్ గట్టిగా ఉంటుందని, కచ్చితంగా పిల్లలు చూడకూడదని అన్నాడు. ఇప్పుడు అదే జరిగింది. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. అంటే 18 ఏళ్లు నిండిన వాళ్లు మాత్రమే ఈ మూవీ చూసేందుకు అర్హులు.

మరోవైపు గతకొన్నాళ్ల క్రితం రిలీజై టీజర్ కూడా రక్తపాతం అనేలా ఉంది. దీంతో మూవీ ఎలా ఉండబోతుందోనని ఫ్యాన్స్ అనుకున్నారు. అయితే సినిమా లోనూ అలాంటి సీన్లు చాలానే ఉన్నాయని, సెన్సార్ వాటిని బ్లర్ చేయమని ఆదేశించిందని తెలుస్తోంది. బూతులు కూడా ఉన్నాయని అందుకే ఏ సర్టిఫికెట్ ఇచ్చారని తెలుస్తోంది.

నాని పోలీస్ గా నటించిన ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకుడు. శ్రీనిధి శెట్టి హీరోయిన్. మే 1న థియేట్రికల్ రిలీజ్. కానీ మూడు వారాల ముందే సెన్సార్ చేయించేశారు. సోమవారం ఉదయం ట్రైలర్ రిలీజ్ చేస్తారు. అలా ప్రమోషన్స్ షురూ చేస్తారనమాట.

# అదృష్టం దగ్గరకొస్తే.. నో చెప్పేసిన సామ్

**అదృష్టం దగ్గరకొస్తే.. నో చెప్పేసిన సామ్ సమంత ఒకప్పుడు స్టార్ హీరోయిన్. ఇప్పుడు పూర్తిగా లైమ్ లైట్ లో లేకుండా పోయింది. చెప్పాలంటే గత కొన్నేళ్లలో కొత్త సినిమాలేం చేయలేదు. వెబ్ సిరీసులు చేస్తోందంతే. గతంతో పోలిస్తే సమంత క్రేజ్ కాస్త తగ్గిన మాట వాస్తవమే. కానీ ఈమె దగ్గరకొచ్చిన కోట్ల రూపాయల డీల్స్ ని ఈమె వద్దనుకుందట. స్వయంగా సామ్ ఈ విషయాన్ని బయటపెట్టింది.**

'20 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చా. అప్పట్లో సక్సెస్ అంటే ఎన్ని సినిమాలు చేశాం, ఎన్ని బ్రాండ్లకు అంబాసిడర్ గా ఉన్నామనేదే చూసేవాళ్లు. దీంతో అంతర్జాతీయ బ్రాండ్స్ కి ప్రచారకర్తగా చేశా. నాకు చాలా ఆనందంగానూ అనిపించింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ప్రమోట్ చేయడంతో పాటు ఎంతో బాధ్యతగా ఉండాలని తెలుసుకున్నాను'

'ఒకప్పుడు ఇష్టమొచ్చిన బ్రాండ్లకు ప్రమోషన్స్ చేశా. అందుకు ఇప్పుడు నేను సారీ చెబుతున్నాను. కోట్ల రూపాయలు డబ్బు ఇస్తామని చెప్పినప్పటికీ గత ఏడాది కాలంలో 15 బ్రాండ్ల వదులుకున్నాను. ఇప్పటికీ చాలా ఆఫర్స్ వస్తున్నాయి కానీ నేను అంగీకరించట్లేదు. నాకు తెలిసిన డాక్టర్స్ ని అడిగి.. సదరు బ్రాండ్లతో ఎలాంటి హాని లేదనిపిస్తేనే ప్రమోట్ చేస్తున్నా' అని సమంత చెప్పుకొచ్చింది.

నెట్ ఫ్లిక్స్ కోసం 'రక్త్ బ్రహ్మాండ్' అనే సిరీస్ చేస్తున్న సమంత.. నిర్మాతగానూ తొలి మూవీ 'శుభం' విడుదలకు సిద్ధం చేసింది



# హీరోయిన్ గా అలా.. ఐటమ్ సాంగ్ చేస్తే మాత్రం

**ప్రస్తుతం చాలామంది హీరోయిన్ల కెరీర్ మహా అయితే రెండు మూడేళ్లు అన్నట్లే సాగుతోంది. మిల్కీ బ్యూటీ తమన్నా మాత్రం దాదాపు 20 ఏళ్లకు పైనే ఇండస్ట్రీలో కొనసాగుతోంది. ఇప్పటికీ హీరోయిన్, ఐటమ్ సాంగ్స్ చేస్తూ ట్రెండ్ ఫాలో అవుతోంది.**

కొన్నాళ్ల ముందు వరకు తమన్నా అంటే హీరోయిన్ మాత్రమే. కానీ రీసెంట్ టైంలో అప్పుడప్పుడు ఐటమ్ సాంగ్స్ చేస్తూ రెండు చేతులా సంపాదిస్తోంది. దానికి తోడు ఈమె చేస్తున్న పాటలు యూట్యూబ్ లో తెగ వైరల్ అవుతున్నాయి.

గతేడాది 'స్త్రీ 2' మూవీలో 'ఆజ్ కీ రాత్' పాట అయితే ఓ ఊపు ఊపేసింది. ఇప్పుడు 'నషా' అనే మరో సాంగ్ తో వచ్చేసింది. రైడ్ 2 సినిమాలోనిది ఈ గీతం. హీరోయిన్ గా చేస్తే రూ.45 కోట్లు తీసుకునే తమన్నా.. ఐటమ్ సాంగ్ కి కూడా రూ.1 కోటికి పైనే పారితోషికం అందుకుంటోందట. నషా పాటకు కూడా అలానే తీసుకుందని టాక్.

ఏదేమైనా హీరోయిన్ గా చేస్తూ మరోవైపు ఐటమ్ సాంగ్స్ చేస్తూ 35 ఏళ్ల వయసులోనూ ఫుల్ ఎంటర్ టైన్ చేస్తోంది. ఇకపోతే ఈమె ప్రధాన పాత్రలో నటించిన ఓదెల 2 అనే తెలుగు సినిమా.. ఈ నెల 18న థియేటర్లలోకి రాబోతుంది. ఇందులో శివశక్తిగా కనిపించనుండటం విశేషం.

# ఎలుగుబంటి ఫన్నీ అడ్వెంచర్స్.. రిలీజ్ ఎప్పుడంటే?




హాలీవుడ్ నుంచి వస్తున్న మరో క్రేజీ మూవీ 'పాడింగ్టన్ ఇన్ పెరు'. అందరికీ ఇష్టమైన ఎలుగుబంటి పెరూ అడవుల గుండా చేసే సాహసయాత్రతో తీసిన సినిమా ఇది. ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తీసిన ఈ చిత్ర మూడో భాగం.. ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఓ ఫన్నీ ఎలుగుబంటి తన అత్త లూసీ, ఎల్ డొరాడోలను వెతుకుతూ ప్రమాదకరమైన అడవులు, నదులు, పురాతన శిథిలాల గుండా ప్రయాణిస్తుంది. చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీలా అనిపిస్తుంది. ఈ క్రమంలోనే చాన్నాళ్ల క్రితమే ట్రైలర్ రిలీజ్ చేశారు. దానిపై మీరు ఓ లుక్కేయండి.



## రికార్డు అర్ధ శతకంతో సత్తా చాటిన విరాట్..
# రాయల్స్‌పై ఆర్సీబీ ఘన విజయం

**ఐపీఎల్ 2025లో భాగంగా జైపూర్ వేదికగా ఇవాళ (ఏప్రిల్ 13) మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.**

రాయల్స్ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 75; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించగా.. ధృవ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. కెప్టెన్ సంజూ శాంసన్ (15) మరోసారి నిరాశపర్చగా.. ఆఖర్లో వచ్చిన హెట్‌మైర్ 9, నితీశ్ రాణా 4 (నాటౌట్) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్, హాజిల్‌వుడ్, కృనాల్ తలో వికెట్ తీశారు.

అనంతరం 174 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆర్సీబీ 17.3 ఓవర్లలో ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 65; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. విరాట్ కోహ్లి (45 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) టీ20 కెరీర్‌లో 100 హాఫ్ సెంచరీ పూర్తి చేసి ఆర్సీబీని విజయతీరాలకు చేర్చాడు. పడిక్కల్ (28 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, సిక్స్) బౌండరీ కొట్టి మ్యాచ్‌ను లాంఛనంగా ముగించాడు. ఈ గెలుపుతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకగా.. రాయల్స్ అదే ఏడో స్థానంలో కొనసాగుతుంది.



## రోహిత్ శర్మ మళ్లీ ఫెయిల్..
# వెళ్లి రెస్ట్ తీసుకో భయ్యా?

**ఐపీఎల్-2025లో టీమిండియా కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ తన పేలవ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. అతడి ఆట తీరు ఏ మాత్రం మారడం లేదు. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రోహిత్ తీవ్ర నిరాశపరిచాడు.**

12 బంతులు ఎదుర్కొన్న రోహిత్.. రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 18 పరుగులు చేసి ఔటయ్యాడు. స్పిన్నర్ విప్రజ్ నిగమ్ బౌలింగ్ రివర్స్ స్వీప్ ఆడి వికెట్ల ముందు హిట్‌మ్యాన్ దొరికిపోయాడు. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడిన రోహిత్ శర్మ.. 11.20 సగటుతో కేవలం 56 పరుగులు మాత్రమే చేశాడు.

0,8,13,17,18 ఇవి వరుసగా రోహిత్ శర్మ చేసిన స్కోర్లు ఇవి. దీంతో మరోసారి విఫలమైన రోహిత్‌ను సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ట్రోలు చేస్తున్నారు. ఆడింది చాలు వెళ్లి రెస్టు తీసుకో రోహిత్ అంటూ పోస్ట్‌లు చేస్తున్నారు. మరికొంత మంది విరాట్ కోహ్లి అద్భుతంగా ఆడుతుంటే నీకు ఏమైంది రోహిత్ అంటూ ప్రశ్నలు వర్షం కురిపిస్తున్నారు.

గతేడాది ఐపీఎల్ సీజన్‌లో కూడా రోహిత్ ఘోరంగా విఫలమయ్యాడు. ఇక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేస్తున్న ముంబై ఇండియన్స్ దూకుడుగా ఆడుతోంది. 13 ఓవర్లు ముగిసే సరికి ముంబై ఇండియన్స్ 2 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది.



## తిలక్ వర్మ అర్ధశతకం.. ఢిల్లీ లక్ష్యం 206

**ఐపీఎల్‌లో భాగంగా ఢిల్లీతో జరుగుతోన్న మ్యాచ్‌లో ముంబయి బ్యాటర్ తిలక్‌వర్మ అర్ధశతకంతో అదరగొట్టాడు.**

**ఢిల్లీ:** ఐపీఎల్‌లో భాగంగా ఢిల్లీతో జరుగుతోన్న మ్యాచ్‌లో ముంబయి బ్యాటర్ తిలక్‌వర్మ అర్ధ శతకంతో అదరగొట్టాడు. దీంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లలో విప్రజ్, కుల్దీప్ రెండేసి వికెట్లు.. ముకేశ్ ఒక వికెట్ తీశారు.

ఓపెనర్ రోహిత్ శర్మ(18) నిరాశపర్చాడు. ఐదో ఓవర్లో విప్రజ్ వేసిన చివరి బంతికి ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ రికెల్టన్(41) మాత్రం దూకుడుగా ఆడి స్కోర్‌ను పెంచే ప్రయత్నం చేశాడు. రోహిత్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్య కుమార్ యాదవ్(40) కూడా బ్యాట్ ఝుళిపించాడు. 5 ఫోర్లు, 2 సిక్సులతో ఆకట్టుకున్నాడు.. అయితే, కుల్దీప్ బౌలింగ్‌లో స్టార్క్‌కి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. తిలక్ వర్మ (59, 33 బంతుల్లో.. 6 ఫోర్లు, 3 సిక్సులు) ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్య (2) తొందరగా ఔటైనా.. ఆ తర్వాత వచ్చిన నమన్ (38*)తో కలిసి చక్కటి ఇన్నింగ్స్ నిర్మించాడు. చివరి ఓవర్లో తిలక్ ఔట్ కావడంతో విల్ జాక్స్ క్రీజులోకి వచ్చి 1* పరుగు తీశాడు.

## చరిత్ర సృష్టించిన
# విరాట్ కోహ్లి.. మరో సెంచరీ

**ఐపీఎల్ 2025లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఇవాళ (ఏప్రిల్ 13) మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 39 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన విరాట్.. టీ20ల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసిన తొలి భారత్ మరియు ఆసియా ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఓవరాల్‌గా చూసినా డేవిడ్ వార్నర్ మాత్రమే విరాట్ కంటే ముందు టీ20ల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నాడు.**

వార్నర్ 400 టీ20 మ్యాచ్‌ల్లో 108 హాఫ్ సెంచరీలు చేయగా.. విరాట్ తన 388వ టీ20 ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించాడు. టీ20ల్లో విరాట్ 388 ఇన్నింగ్స్‌లు ఆడి 9 సెంచరీలు, 100 హాఫ్ సెంచరీల సాయంతో 13100 పైచిలుకు పరుగులు చేశాడు.

**టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన టాప్-5 ప్లేయర్లు**
**వార్నర్- 108**
**విరాట్- 100**
**బాబర్ ఆజమ్- 90**
**గేల్- 88**
**బట్లర్- 86**



కాగా, రాయల్స్‌తో మ్యాచ్‌లో విరాట్ రికార్డు హాఫ్ సెంచరీతో చెలరేగడంతో ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.

రాయల్స్ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 75; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించగా.. ధృవ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. కెప్టెన్ సంజూ శాంసన్ (15) మరోసారి నిరాశపర్చగా.. ఆఖర్లో వచ్చిన హెట్‌మైర్ 9, నితీశ్ రాణా 4 (నాటౌట్) పరుగులు

**విరాట్ హాఫ్ సెంచరీల సెంచరీని విరాట్ సిక్సర్‌తో అందుకోవడం విశేషం. ప్రస్తుత సీజన్‌లో విరాట్‌కు ఇది మూడో హాఫ్ సెంచరీ. అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ ఐదో స్థానానికి ఎగబాకాడు. ఈ సీజన్‌లో విరాట్ 6 మ్యాచ్‌ల్లో 62 సగటున, 143.35 స్ట్రయిక్ రేట్‌తో 248 పరుగులు చేశాడు. 6 మ్యాచ్‌ల్లో 349 పరుగులు చేసిన పూరన్ అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు.**

చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్, హాజిల్‌వుడ్, కృనాల్ తలో వికెట్ తీశారు.

అనంతరం 174 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆర్సీబీ.. 17.3 ఓవర్లలో ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 65; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. విరాట్ కోహ్లి (45 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయమైన అర్ధ సెంచరీతో ఆర్సీబీని విజయతీరాలకు చేర్చాడు. పడిక్కల్ (28 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, సిక్స్) బౌండరీ కొట్టి మ్యాచ్‌ను లాంఛనంగా ముగించాడు.

## ఢిల్లీ జైత్రయాత్రకు బ్రేక్..
# ఉత్కంఠ పోరులో నెగ్గిన ముంబయి

**ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ముంబయి ఇండియన్స్ 12 పరుగుల తేడాతో నెగ్గింది.**

**ఢిల్లీ:** ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. ఐపీఎల్ 18లో ముంబయి ఇండియన్స్ రెండో విజయం సాధించింది. ఢిల్లీతో జరిగిన ఉత్కంఠ పోరులో హార్దిక్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ(59) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో కరుణ్ నాయర్ (89: 40 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) విశ్వరూపం ప్రదర్శించాడు. ముంబయి బౌలర్లలో కర్ణ్ శర్మ 3, దీపక్ చాహర్ 1, బుమ్రా 1, శాంట్నర్ 1 వికెట్లు తీశారు.

తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ (59: 33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో చెలరేగాడు. ఓపెనర్ రోహిత్ శర్మ(18) మరోసారి నిరాశపరిచాడు. ఐదో ఓవర్లో విప్రజ్ వేసిన చివరి బంతికి ఎల్బీగా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ రికెల్టన్(41: 25 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. రోహిత్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్య కుమార్ యాదవ్(40: 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా బ్యాట్ ఝుళిపించాడు. చివర్లో నమన్ (38*: 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు)ఉన్నంత సేపు దూకుడుగా ఆడాడు. ఢిల్లీ బౌలర్లలో విప్రజ్, కుల్దీప్ రెండేసి వికెట్లు.. ముకేశ్ ఒక వికెట్ తీశారు.



# 141 పరుగులు చేసినా..
## మా నాన్నను మెప్పించలేకపోయా: అభిషేక్ శర్మ

**అభిషేక్ విశ్వరూపం చూపించాడు. భారీ శతకంతో ఎస్ఆర్‌హెచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఇది తన తండ్రిని మాత్రం మెప్పించిలేకపోయిందని వ్యాఖ్యానించడం గమనార్హం.**

**ఇంటర్నెట్ డెస్క్:** ఎట్టకేలకు అభిషేక్ శర్మ మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. పంజాబ్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 141 పరుగులు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను గెలిపించాడు. కానీ, ఈ ఇన్నింగ్స్ తన తండ్రి రాజ్ కుమార్ శర్మ ఆశించిన లక్ష్యాన్ని అందుకోలేదని అభిషేక్ శర్మ వెల్లడించాడు. ఐపీఎల్ (IPL) చరిత్రలో లక్ష్య ఛేదనకు దిగిన తర్వాత అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇక ఓవరాల్‌గా మూడో ఐపీఎల్ అత్యధిక వ్యక్తిగత స్కోరు. మైదానంలో తన తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఆరెంజ్ ఆర్మీ, పేరెంట్స్ ముందు సంబరాలు చేసుకోవడం భలేగా అనిపించిందని అభిషేక్ తెలిపాడు.



### అభిషేక్‌కు అదే చెప్పా: రాజ్‌కుమార్

**“ఈ సంతోషాన్ని ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. మ్యాచ్‌కు ముందు మేమిద్దరం మాట్లాడుకొనే సమయంలో ఒకటే చెప్పా. ఫామ్ గురించి ఆందోళన చెందొద్దని సూచించా. ప్రతి క్రికెటర్ కెరీర్‌లో ఇలాంటిది సహజమే. గత మ్యాచుల్లో అతడికి పెద్దగా ఏదీ కలిసిరాలేదు. రెండో మ్యాచ్‌లో రనౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత మ్యాచుల్లో షాట్లు కొట్టినా పరుగులు చేయలేకపోయాడు. ఈసారి మాత్రం ఆత్మవిశ్వాసంతో ఆడాడు. జట్టు కోసం విజయం అందించాడు. రాబోయే రోజుల్లో మరింత దూకుడుగా ఆడతాడు. మ్యాచ్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ విజయానికి తప్పకుండా పరుగులు చేస్తానని చెప్పాడు” అని రాజ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు.**

‘‘ఇప్పుడీ మ్యాచ్ నాకెంతో స్పెషల్. అండర్ 14 రోజుల నుంచి నా ఆటను చూసేందుకు మా నాన్న మైదానాలకు వచ్చేవారు. ఇప్పుడు పంజాబ్‌పై నేను ఆడుతున్నప్పుడు మా నాన్నను దగ్గర నుంచి గమనిస్తే ఓ విషయం తెలుస్తుంది. ఏదో సైగలు చేస్తూ కనిపిస్తారు. నేను ఏ షాట్లు కొట్టాలో.. వద్దో చెబుతూ ఉండేవారు. ‘అలా కొట్టు.. ఇలా కొట్టు’ అని చెబుతూ కనిపించేవారు. ఆయనే నా తొలి కోచ్. ఇప్పుడు మా అమ్మానాన్న ముందు సెంచరీ చేయడం భలేగా ఉంది. ఐపీఎల్‌లో ఇదే నా అత్యధిక స్కోరు. అయితే, మా నాన్నకు పెద్దగా అనిపించలేదు. నన్ను చివరి వరకూ క్రీజ్‌లో ఉండాలని ఆయన కోరుకున్నారు. ప్రతి విషయంలో ఇంప్రూవ్‌మెంట్ ఉంటుంది. అందుకోసం నేను నిరంతరం శ్రమిస్తూనే ఉంటా’’ అని అభిషేక్ వెల్లడించాడు.